క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



బీబీపేట: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం తుజాల్‌పూర్‌లో మెడిసిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 165 మందికి ఓపీ, 40 మందికి ఐపీ సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి ఆపరేషన్ చేయిస్తామన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు శశాంక్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్, మండల చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్, ఎంపీపీ బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

దళితుల జీవన విధానంపై సర్వే



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో మంగళవారం ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ బృందం దళిత కుటుంబాల జీవన విధానంపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్చ్ అసోసియేట్ సూపర్‌వైజర్ భాస్కర్ మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి దళితులను ఆర్థికంగా మెరుగు పరచడానికి సర్వే చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా తెలంగాణాలో 10 వేల కుటుంబాలను రాండమ్‌గా ఎంపిక చేసుకుని సర్వే చేస్తున్నామన్నారు.

84వ రోజుకు చేరిన నిరసన దీక్షలు



భిక్కనూరు: పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్న ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 84వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఈ దీక్షలో గ్రామానికి చెందిన పలువురు కూర్చుని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ట్రాక్టర్లు నడిపేవారు జాగ్రత్తలు తీసుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ట్రాక్టర్లు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. ఆయన సోమవారం మాట్లాడారు. ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసే ముందు ట్రాక్టర్‌కు సంబంధించిన భాగాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. ట్రాక్టర్‌కు సంబంధించిన ఎక్స్‌లేటర్ మాన్యువల్‌గా ఉండేలా చూడాలని, స్పీడ్‌గా నడిపించవద్దని సూచించారు. పొలంలో దున్నేటప్పుడు బురదలో చిక్కుకుపోతే కేజ్ వీల్‌ను కర్రల సహాయంతో తీయకుండా ఇతర ట్రాక్టర్ల సహాయంతో బయటకు తీయాలన్నారు. కేజ్‌వీల్ ట్రాక్టర్లను రోడ్లపై నడిపేటప్పుడు తప్పనిసరిగా పట్టీలు ఉండేలా చూసుకోవాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

రూ.1.14 కోట్ల రుణాల పంపిణీ



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రుణ మేళాలో రూ.కోటి 14 లక్షల 25 వేల రుణాలను 11 మహిళా సంఘాలకు పంపిణీ చేసినట్లు బ్యాంక్ మేనేజర్ యోగేష్, ఫీల్డ్ ఆఫీసర్ అనూష, ఐకేపీ సీసీ విశ్వనాథం తెలిపారు. డీఆర్‌డీవో ఆదేశాల మేరకు ఈ బ్యాంకు రుణమేళా నిర్వహించినట్లు వెల్లడించారు.

పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి



దోమకొండ: కామారెడ్డి నియోజకవర్గంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అభ్యర్థులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలోని వివిధ గ్రామాల కమిటీ అధ్యక్షులు నూతనంగా ఎన్నికై న మండల అధ్యక్షుడిని సన్మానించారు. అనంతరం అనంతరెడ్డి మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల నాయకులు సీతారాం మధు, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా కాస్మొటిక్ చార్జీలు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- తల్లిదండ్రులపై ఆర్థిక భారం

బిచ్కుంద(జుక్కల్): బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌందర్య సాధనాల(కాస్మొటిక్) చార్జీలు ఏమాత్రం సరిపోవడం లేదు. చార్జీల పెంపు కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నా పట్టించుకోవడం లేదు. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.62 మాత్రమే ప్రభుత్వం అందిస్తోంది. అదీ కూడా మూడు, నాలుగు నెలలకు ఒకసారి వస్తున్నాయి. స్నానం సబ్బు, బట్టల సబ్బు, టూత్‌పేస్టు, బ్రష్, తలనూనె, పౌడరు ఈ వస్తువులన్నీ రూ.62 లోనే కొనుక్కోవాలి. ఈ డబ్బులు సబ్బులకే సరిపోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొంతన లేని చెల్లింపులు..

బహిరంగ మార్కెట్‌లో కాస్మొటిక్ సామగ్రి ధరలతో పోల్చితే ప్రభుత్వం అందిస్తున్న చార్జీలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. అన్ని వస్తువుల ధరలు రెట్టింపయ్యాయి. మైనార్టీ గురుకుల పాఠశాలలో కాస్మొటిక్ చార్జీలు ఇవ్వకుండా ప్రభుత్వం అన్ని



వస్తువులు ఉన్న కిట్లు పంపిణీ చేస్తోంది. కానీ ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థుల పట్ల మాత్రం ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 56 సంక్షేమ వసతి గృహాలు..

కామారెడ్డి జిల్లాలో 30 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు, 26 బీసీ వసతి గృహాలున్నాయి. ఎస్సీ హాస్టళ్లలో 2 వేల మంది విద్యార్థులు, బీసీ హాస్టళ్లలో 1,700 మంది విద్యార్థులున్నారు. ప్రస్తుతం ఒక్క ధర రూ.60 ఉంది. ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో మిగతావి ఎలా కొనుక్కోవాలని విద్యార్థులు సూటిగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

డబ్బులు సరిపోవడం లేదు

ప్రభుత్వం అందిస్తున్న చార్జీ లు సరిపోవడం లేదు. రెండు సబ్బులు కూడా రావడం లేదు. ప్రతి నెలా డబ్బుల కోసం తల్లిదండ్రుల రాక కోసం ఎదురుచూస్తున్నాం. మాపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ప్రభుత్వం చార్జీలు పెంచి ఇవ్వాలని కోరుతున్నాం.

– కరణ్, 10వ తరగతి, బీసీ హాస్టల్ విద్యార్థి, బిచ్కుంద

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

విద్యార్థులకు ప్రభుత్వం చెల్లిస్తున్న చార్జీలు రూ.62 సరిపోవడం లేదు. కనీసం రూ.150 చెల్లించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అమలు చేయాలని జీవో వచ్చిన వెంటనే కాస్మొటిక్ చార్జీలు పెంచి ఇస్తాం.

– వెంకటేశ్, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి

పీహెచ్‌సీలో తాత్కాలికంగా కరెంట్ ఏర్పాటు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం స్థానిక సర్పంచ్ కిచ్చయ్యగారి సునీతరెడ్డి తాత్కాలికంగా కరెంట్‌ను ఏర్పాటు చేయించారు. 'సాక్షి' దినపత్రికలో 'అంధకారంలో పీహెచ్‌సీ' అనే శీర్షికతో శనివారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. పీహెచ్‌సీలో కరెంట్ సరఫరా లేకపోవడంతో రాత్రివేళ ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్న విషయం గమనించారు. జీపీ నిధులతో పీహెచ్‌సీలో తాత్కాలికంగా బల్బులను ఏర్పాటు చేయించారు. పీహెచ్‌సీలో ఉన్న సమస్యలను ఆమె ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



పీహెచ్‌సీలో ట్రాన్స్‌కో సిబ్బందితో సునీతా రెడ్డి

సురేందర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఎమ్మెల్యే ఆదేశించారని ఆమె చెప్పారు.

స్వీపర్ల డిమాండ్లను నెరవేర్చాలి

- నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో 40 ఏళ్లుగా పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. సోమవారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్ద స్వీపర్లు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శివంది సత్యం వారికి మద్దతు పలికి మాట్లాడారు. వారికి



మద్దతు తెలిపి మాట్లాడుతున్న నేత సత్యం

ఉద్యోగ భద్రత కల్పించి రూ.27 వేల వేతనం చెల్లించాలన్నారు. చనిపోయిన స్వీపర్ల స్థానంలో వారి వారసులను నియమించాలన్నారు. విద్యార్హత ఉన్న వారికి అటెండర్‌లుగా నియమించాలన్నారు. రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని లేకుంటే చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

బీజేపీలో శాబ్దిపూర్ యువకుల చేరిక



పార్టీలో చేరిన వారితో కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి రూరల్: శాబ్దిపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం బీజేపీలో చేరారు. కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, బీజేపీ చేస్తున్న పనులకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలో వచ్చే విధంగా కృషి చేస్తామని అన్నారు. నాయకులు నరేందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

మాచారెడ్డి: అక్కాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ భవనం ప్రహరీ నిర్మాణానికి సోమవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి భూమి



భూమి పూజ చేస్తున్న వెంకట రమణారెడ్డి

పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీల ఫ్లెక్సీల ఏర్పాటు

మాచారెడ్డి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల హామీల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గణేష్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని అన్నారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు రైతు బంధు చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని అన్నారు. నాయకులు కొమురయ్య, స్వామి, రాజేందర్, శ్రీను, నరేష్, వెంకటేష్,గణేష్ ఉన్నారు.



ఎల్లంపేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నిర్వాహకులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎండీఎం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు సోమవారం ఎమ్మెల్యే సురేందర్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన నిర్వాహకులు పెండింగ్ వేతనాలు, బిల్లులను మంజూరు చేసేలా తగిన చర్యలను తీసుకోవాలని విన్నవించారు. నిర్వాహకులు సాయిలు, సోఫియా, దుర్గవ్వ తదితరులున్నారు.

కళాశాల ఏర్పాటు కోసం సహకరించండి



బీబీపేట: బీబీపేటలో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం అధికార పార్టీ నేతలు సహకరించాలని కోరుతూ సోమవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డిలకు జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మూడేళ్ల క్రితం మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారని, ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని అన్నారు. త్వరలో కోనాపూర్‌లో మంత్రి కేటీఆర్ నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభానికి రానున్నందున జూనియర్ కళాశాల ఏర్పాటుపై తేల్చాలని డిమాండ్ చేశారు.

సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



వినతి పత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

భిక్కనూరు: జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటు మల్లుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రానికి వచ్చిన గోవర్ధన్‌ను జీపీ కార్మికులు కలిసి తమ దీక్ష శిబిరానికి ఆహ్వానించారు. తమ న్యాయమైన కోర్కెలకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

గోబెల్స్ ప్రచారం బీఆర్‌ఎస్‌కే సాధ్యం

భిక్కనూరు: చెయ్యని అభివృద్ధి పనులను, ప్రజలకు అందించని సంక్షేమ పథకాల గురించి అన్నీ చేశామంటూ ప్రజలను మభ్యపెట్టడం, గోబెల్స్ ప్రచారం చేయడం బీఆర్‌ఎస్ నేతలకే సాధ్యమని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. సోమవారం ర్యాగట్లపల్లిలో బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తప్పుడు సమాచారంపై గ్రామస్తులకు వివరించారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీరెడ్డిలు ర్యాగట్లపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో రైతుబీమా కింద గ్రామంలో 12 మంది కుటుంబాలకు రూ.60 లక్షలు అందించామని ప్రచురించారని, గ్రామంలో ఒక్కరికే రైతు బీమా ఇచ్చారని వివరించారు. బీఆర్‌ఎస్ నేతల తప్పుడు ప్రచారానికి ఫ్లెక్సీనే నిదర్శనమన్నారు. నేతలు రవీందర్, కరణ్ రెడ్డి, రాములు, సాయిలు, బాబు ఉన్నారు.



తప్పుడు సమాచారం గురించి వివరిస్తున్న నేతలు

ఫ్లెక్సీల తొలగింపు

భిక్కనూరు: ర్యాగట్లపల్లిలో బీఆర్‌ఎస్ నేతలు ఇటీవల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సోమవారం తొలగించారు. రైతు బీమా 12 మందికి ఇచ్చినట్లు ఫ్లెక్సీతో తప్పుడు ప్రచారం చేయడంతో ' సాక్షి' దిన పత్రికలో 'ఇసిత్రం' పేరిట సోమవారం వార్త ప్రచురితమైంది. ఈ వార్త రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఫ్లెక్సీలను తొలగించారు. బీఆర్‌ఎస్ నేతలే ఈ ఫ్లెక్సీలను తొలగించి ఉంటారని అనుమానిస్తున్నారు.

నాయక్‌పోడ్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



సమావేశమైన ఆదివాసి నాయక్‌పోడ్ కులస్తులు

నిజాంసాగర్(జుక్కల్): బూర్గుల్ గ్రామ సాయిబాబ ఆలయం వద్ద సోమవారం ఆదివాసి నాయక్‌పోడ్ జిల్లా కార్యవర్గం సభ్యులు సమావేశమయ్యారు. సమస్యలను సభ్యులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం నాయక్‌పోడ్ ఉద్యోగ సంక్షేమ సంఘాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పెంటయ్య తెలిపారు. ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షులుగా దయానంద్, బాలయ్య, మహిళా ఉపాధ్యక్షులుగా హరీష, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శులుగా రవీందర్, భూమయ్య, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా విఠల్, తదితరులు ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన సాతెల్లి సర్పంచ్



సాతెల్లి సర్పంచ్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జాజాల



కండువాలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలో మదన్‌మోహన్ వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, సాతెల్లి సర్పంచ్ సంగమేశ్వర్ సోమవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సురేందర్, సర్పంచ్ సంగమేశ్వర్‌కు బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, సొసైటీ చైర్మన్ నర్సింలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జలందర్‌రెడ్డి, తదితరులున్నారు.

బాన్సువాడలో మైనారిటీ యువకులు..

బాన్సువాడ : పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ యువకులు సోమవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, షేక్ జుబేర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, తదితరులున్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయండి



మద్నూర్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు



తాడ్వాయిలో

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెల్సిందే. సోమవారం సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో భిక్షాటన చేసి జీపీ కార్మికులు నిరసన తెలిపారు. పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కనీస వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పలు పార్టీల నేతలు మద్దతు తెలిపారు.

– మద్నూర్/తాడ్వాయి/భిక్కనూరు/లింగంపేట/బీబీపేట



లింగంపేట అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



భిక్కనూరులో.. భిక్షాటన



బీబీపేటలో నిరవధిక సమ్మె..

సంక్షిప్తం

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ప్రధాన రహదారిపైన సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. పలువురికి జరిమానాలు విధించారు. మండల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలానికి చెందిన అయా గ్రామాలకు చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు సోమవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థితిగతులను రేవంత్‌రెడ్డి, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి, గెలుపుకోసం కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో నల్లమడుగు షరీఫ్, రాజు, రహీం, రవితేజ, పలువురు ఉన్నారు.

అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన చాకలి మద్నూర్ సాయిలు అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేదని, అంత్యక్రియలు చేయడానికి కూడా డబ్బులు లేవని ఆయన సామాజిక వర్గం వారు సోమవారం కాంగ్రెస్ నాయకుడు, ఎంపీటీసీ కామెల్లి బాల్‌రాజు దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీటీసీ స్థానిక నాయకులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుమారుడు లక్ష్మణ్‌కు రూ.5000 నగదు అందజేశారు.

అఖండ హరి నామ సప్తాహం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి సోమలింగేశ్వర ఆలయంలో మంగళవారం నుంచి అధిక మాస హరినామ సప్తాహం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాములు మహారాజ్ తెలిపారు. నేటి నుంచి వచ్చే నెల 17 వరకు నెల రోజుల పాటు ప్రతిరోజు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు, వార్కారీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

నిజ శ్రావణంలోనే వ్రతాలు, ఉపవాసాలు

కామారెడ్డి అర్బన్: ఈ నెల 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణమాసం, ఆగస్టు 17 నుంచి నిజ శ్రావణ మాసం ఉంటుందని కామారెడ్డి స్థానిక పండితులు శశికాంత్‌శర్మ తెలిపారు. శ్రావణ ఉపవాసాలు, వ్రతాలు నిజ శ్రావణంలో ఆగస్టు 17 నుంచి పాటించాలని సూచించారు.

రైతు వేదికలో ఎమ్మెల్యే సమావేశం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతులతో ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమావేశం కానున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు తెలిపారు. సమావేశానికి రైతులు, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా రఘువీర్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ పోస్టాఫీసు బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా రఘువీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బీపీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో ఉపాధి కూలీలు, ఆసరా పింఛన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బాన్సువాడ మండలంలోని బ్రాంచ్ పోస్టుమాస్టర్ పనిచేస్తున్న రఘువీర్ మహమ్మద్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు మాజీ జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజును ఆయన కలిశారు.